క్లుప్తంగా

నరిసింహారావును అభినందించిన కలెక్టర్



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా పట్టణంలోని గార్ల పాడు బస్ స్టాప్ సెంటర్‌లో గల గీత మందిరం దేవాలయం ఎదురుగా డ్రై ఫ్రూట్స్ దుకాణంలో ఇటీవల మహిళల బంగారు గొలుసు లాక్కుని వెళ్లటానికి ప్రయత్నించిన దుండగుడ్ని ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పట్టుకున్న వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావును జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అభినందించారు. నగరోదయంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 25వ వార్డుకు వచ్చిన కలెక్టర్ శివ శంకర్ విషయం తెలుసుకొని నరసింహారావును ప్రత్యేకంగా అభినందించారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రామకృష్ణప్రసాద్

రాజుపాలెం: రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయానికి ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారిగా(ఎఫ్ఏసీ) ఎన్.రామకృష్ణప్రసాద్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ప్రస్తుతం రామకృష్ణప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న తలుపుల శ్రీనివాసరావు గురువారం పదవీ విరమణ చేయడంతో రామకృష్ణ ప్రసాద్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు.

రేపు బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

సత్తెనపల్లి: పట్టణంలోని సత్య ధ్యానమందిర ఆవరణలో ఈ నెల 3న సాయంత్రం 3 గంటలకు సత్తెనపల్లి నియోజకవర్గ స్థాయిలో బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంఘ రాష్ట్ర నాయకుడు గణపవరపు రంగారావు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని బ్రాహ్మణ మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులు అభిమానులు ఆత్మీయ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో దాత అచ్చి అనిల్‌కుమార్, లిఖిత దంపతుల సహకారంతో అచ్చి శ్రీనివాసరావు 13వ వర్ధంతి సందర్భంగా అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణానికి చెందిన నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యుడు మోదుగుల బాబ్జీ కుమార్ మాట్లాడుతూ అమ్మ చేయూత సొసైటీ సేవలు అద్భుతం అని కొనియాడారు. అమ్మ చేయూత ద్వారా ఎంతో మంది పేదలకు భోజనం, నిత్యావసర సరుకులు అందిస్తున్నారాని అన్నారు. అమ్మ చేయూత సొసైటీకి తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ కుమ్మరి దస్తగిరి, ట్రస్ట్ సభ్యులు రత్తయ్య, హరే కృష్ణ, అంకమ్మరావు, శివ, నీలయ్య, టైలర్ జానీ, చిన్న షరీఫ్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

బెల్లంకొండ: వేసవి నేపథ్యంలో దాహార్తి కోసం అడవుల నుంచి బయటకు వస్తున్న జీవుల పట్ల ప్రతి ఒక్కరూ సహృదయంతో ఉండాలని పాపాయపాలెం సెక్షన్ డీఆర్‌వో రమణయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో గ్రామస్తులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ జంతువులను వేటాడేందుకు అడవులలో ఉచ్చులు పెట్టడం, విద్యుత్ తీగలు అమర్చడం వంటి చర్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అడవులలో చెట్లను నరికి ఆక్రమణలు చేయడం, అడవులకు నిప్పు పెట్టడం వంటివి చట్టరీత్యా నేరమని తెలిపారు. తద్వారా వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. అదే విధంగా అటవీ ప్రాంతాలలో రంగు రాళ్ల కోసం, గుప్త నిధుల తవ్వకాలు చేసేందుకు వస్తున్నారని, వాటికోసం ఎవరూ అటవీ ప్రాంతాలకు రావద్దని అన్నారు. అందరూ అటవీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో కృష్ణమూర్తి, సర్పంచ్ దేసు మల్లేశ్వరి బ్రహ్మం, ఎంపీటీసీ చిట్టిశెట్టి శివనాగమణి, భద్రయ్య పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో గల ఆదర్శపాఠశాలలో ఆరోతరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.వేణాంగిణి మేరీ శుక్రవారం తెలిపారు. మార్చి 3వ తేదీ నుంచి 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21న ఆయా పాఠశాలల్లో నిర్వహించబడుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.75, బీసీ, ఓసీలు రూ.150 దరఖాస్తు ఫీజు చెల్లించాలని అన్నారు. పూర్తి వివరాలకు ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో గానీ పాఠశాలలో గానీ సంప్రదించాలని సూచించారు.

భూమికి బలమిచ్చేలా...

- భూసార పరీక్షలు తప్పనిసరి
- మట్టి నమూనాల సేకరణకు ఇదే అనువైన సమయం
- భూమికి కావాల్సిన పోషకాలకు భూసార పరీక్షలు
- మట్టి నమూనాల సేకరణకు యంత్రాంగం సన్నద్ధం
- నియోజకవర్గంలో 50 రైతు భరోసా కేంద్రాలు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సత్తెనపల్లి: క్రమ పద్ధతిలో పంటలు సాగు చేయకపోవడం, రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగం వల్ల భూసారం రోజురోజుకు తగ్గిపోతోంది. దీంతో దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీని నివారణకు భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత వాతావరణం భూసార పరీక్షలకు అనువుగా ఉంది. భూసార పరీక్షల వల్ల భూమికి ఏయే పోషకాలు కావాలో తెలుస్తుంది. దీంతో ఆయా ఎరువులను భూమికి వేయడంతో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

భూసార పరీక్షల్లో దశలు..

- మట్టి నమూనాల సేకరణ
- భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు
- ఫలితాల ఆధారంగా ఎరువుల సిఫారసు

మట్టి సేకరణలో జాగ్రత్తలు..

- పొలం గట్ల పక్కన మట్టి నమూనాలు సేకరించకూడదు.
- నీటి ముంపు ఉన్న ప్రాంతం, చెట్ల నీడ ఉన్న దగ్గర, వాటి వేర్లు వ్యాపించి ఉన్న దగ్గర తీయరాదు.
- సేంద్రియ, రసాయన ఎరువులు వేసిన తర్వాత తీయకూడదు.
- సేంద్రియ, రసాయన ఎరువులు వేసిన 50 రోజుల తర్వాత మట్టి నమూనాలు తీయాలి.
- చౌడు, ఆమ్ల నేలల్లో వేర్వేరుగా మట్టి నమూనాలు సేకరించాలి.

మట్టి నమూనాల సేకరణ ఇలా..

15–30 సెంటీమీటర్ల లోతులో మట్టి నమూనాలు తీయాలి. ఎటువంటి చెత్త ఉన్నా దానిని తొలగించి 15–30 సెంటీమీటర్ల లోతులో 'వి' ఆకారం గుంత చేసుకొని, ఒకే మందంలో పై నుంచి కింద వరకు పలుచని పొరలుగా మట్టిని సేకరించాలి. జిగ్‌జాగ్ పద్ధతిలో 10 నుంచి 15 చోట్ల మట్టిని సేకరించాలి. ఏవైనా మట్టిగడ్డలు ఉంటే వాటిని చిదిమి వేసి, తర్వాత ఆ మట్టిని నాలుగు భాగాలుగా చేసి ఒక్కో భాగం నుంచి కొంత మట్టి చొప్పున ఒక కిలో మట్టిని నమూనాకు తీసుకోవాలి.

స్థూల, సూక్ష్మ పోషకాలు లోపించకుండా..

భూసార పరీక్షల ఫలితం ఆధారంగా భూమికి ఏయే సూక్ష్మ, స్థూల పోషకాలు అవసరమో అధికారులు తెలియజేస్తారు. స్థూల, సూక్ష్మ పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, జింకు, బోరాన్, సల్ఫర్, ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, జిప్సమ్ లోపిస్తే దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి.

ఈ లోపాన్ని గుర్తించి సకాలంలో వాటిని వేసుకుంటే దిగుబడులు పొందవచ్చు. ఇందుకు భూసార పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయి.

నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు

మండలం	ఆర్బీకేలు
సత్తెనపల్లి	19
ముప్పాళ్ళ	10
రాజుపాలెం	10
నకరికల్లు	11
మొత్తం	50

భూసార పరీక్షలు చేయించుకోవాలి..



భూసార పరీక్షలకు అవసరమైన మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించాం. రైతుల తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. వాటి ఫలితం ఆధారంగా ఎరువులు వేసుకోవచ్చు. దీంతో ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయి. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఎస్.శ్రీధర్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

వైద్యులతో మంత్రి అంబటి భేటీ



పట్టణంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ మహేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పట్టణంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. పలు ప్రముఖ వైద్యశాలల వైద్యులతో ఆయన వ్యక్తిగతంగా భేటీ అయ్యారు. స్థానికంగా నెలకొన్న పలు అంశాలపై చర్చించారు. గీతా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పీ మహేశ్వర్ రెడ్డి , డాక్టర్ ఎస్.రాజామోహన్ రెడ్డి, డాక్టర్ గీతా హాసంతి, మేఘనా స్కాన్ సెంటర్ రేడియాలజిస్ట్ డాక్టర్ గీతా ప్రశాంతి, నేత్ర వైద్యశాల వైద్యులు డాక్టర్ గాలి వెంకట్రావు, ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ రమేష్, సుధాకర్ చిన్న పిల్లల వైద్యశాల వైద్యులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ జెట్టి శ్రీనివాసరావు, అపూర్వ హాస్పిటల్ అధినేత డాక్టర్ నవీన్ కుమార్, పూర్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ రాజేష్, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ శివన్నారాయణ, శ్రీవిద్య హాస్పిటల్ అధినేత డాక్టర్ చిరంజీవి తదితరులతో కలిసి చర్చించారు. నియోజకవర్గంలో ప్రశాంతమైన వాతావరణాన్ని అందించామని, రానున్న ఎన్నికల్లో సహకరించాలని వారిని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ఎస్సీ సెల్ నాయకుడు కోడిరెక్క దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

దమ్మాలపాడు, గోళ్ళపాడులో గ్రామోదయం



దమ్మాలపాడు గ్రామంలో పర్యటిస్తున్న తహసీల్దార్ సింగారావు, ఇతర శాఖల అధికారులు

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు, గోళ్ళపాడు గ్రామాల్లో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా దమ్మాలపాడులో తహసీల్దార్ పీ సింగారావు, ఇతర శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి వారి హెల్త్ రికార్డులను పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ తయారు చేస్తున్న ఎరువును పరిశీలించారు. క్లాప్‌మిత్రలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. అనంతరం వారిని సన్మానించారు. గ్రామంలో సేకరిస్తున్న వ్యర్థాలను ఎలా తరలిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలలో భాగంగా అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిపట్టా రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గోళ్ళపాడు గ్రామంలో జరిగిన గ్రామోదయంలో సర్పంచ్ గోపు అప్పమ్మ, ఎంపీడీవో కార్యాలయం ఏవో శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్తెమ్మ తల్లి తిరునాళ్ల



అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుటుంబ సభ్యులు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా అచ్చంపేట అటవీ ప్రాంతంలో వేంచేసియున్న సత్తెమ్మతల్లి తిరునాళ్ల శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు కల్యాణ మహోత్సవం బయ్యవరం గ్రామానికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానం వద్ద గాయత్రి, చండీ హోమాలు నిర్వహించారు. సత్తెమ్మ తల్లి మాలధారణ భక్తులు మాల విరమణ అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు 108 మహిళలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు కుటుంబసభ్యులతో నిర్వహించారు. భక్తులకు పసుపు కుంకుమతోపాటు చీరలు పంపిణీ చేశారు. తిరునాళ్ల మహోత్సవానికి క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొందుగల గాయత్రి ఆశ్రమం నిర్వాహకులు గౌతమ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత దేశమే లక్ష్యం



పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ గౌతమి, పక్కన వైద్యులు



పల్స్ పోలియో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: పోలియో రహిత భారత దేశం వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుందని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. ఈ నెల 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో వ్యాక్సినేటర్స్, ఆరోగ్య సిబ్బందికి శుక్రవారం సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ 100 శాతం పోలియో చుక్కలు వేయడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. 3న పల్స్ పోలియో బూత్‌లో, 4, 5 తేదీల్లో సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ మార్కింగ్ చేస్తూ మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సూచించారు. చిన్న చిన్న రుగ్మతలు (జ్వరం, విరోచనాలు) ఉన్నా పోలియో చుక్కలు వేయవచ్చన్నారు. డాక్టర్ కవిత మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ మొదలు ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ అలాగే వ్యవసాయ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు, ఊరి బయట పాకలు వేసుకున్న వారు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, బిచ్చగాళ్లు తదితరులలో అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. కో లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ సాయితేజ రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి రూరల్ మండలంలో 5 సంవత్సరాలలోపు పిల్లలు 6,874 మంది ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు వేయడానికి 35 పల్స్ పోలియో కేంద్రాలు, ఒక మొబైల్ యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యాక్సిన్, సామగ్రి పర్యవేక్షణ నిమిత్తం మూడు రూట్‌లుగా విభజించి పర్యవేక్షించుట జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది 2వ, 3వ రోజు గృహాలను సందర్శించి మార్కింగ్ చేయడం ద్వారా మొదటి రోజు చుక్కలు వేయించుకొనని పిల్లలు ఉంటే వారికి పోలియో చుక్కలు వేయాలన్నారు. శిక్షణలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు జె.సంపూర్ణ, ఏ వరలక్ష్మి, ఎస్‌కే కరీముల్లా, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

పెదకూరపాడు: ఈనెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి, డాక్టర్ ఆదిత్య శుక్రవారం తెలిపారు. 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 5 సంవత్సరాల్లోపు చిన్నారులు 3,346 ఉన్నట్లు గుర్తించామన్నారు. వలస చిన్నారులు 238 మందిగా గుర్తించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 28 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొబైల్ వాహనం ద్వారా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో విజయకుమార్, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్, సీహెచ్ఎం దుర్గాకుమారి పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



దొడ్లేరులో పోలియో చుక్కలపై ర్యాలీ

దొడ్లేరు(క్రోసూరు): చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మహమ్మద్ సాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దొడ్లేరులో వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ఈనెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దొడ్లేరులోని ప్రాథమిక పాఠశాల నుంచి గ్రామ సచివాలయాల కార్యాలయాల వరకు ర్యాలీ సాగింది. పాఠశాల విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. పోలియో రహిత సమాజం మన ధ్యేయం, నిండు జీవితానికి రెండు చుక్కలు, పోలియో చుక్కలు వేయించు అక్క అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహమ్మద్ సాద్ మాట్లాడుతూ 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, గ్రామ కార్యదర్శి వెంకయ్య, హెచ్ఎం పాపులమ్మ, ఉపాధ్యాయులు, సీహెచ్‌వో భూలక్ష్మి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దండిగా పింఛన్

- తలుపు తట్టి.. వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు



26వ వార్డులో కొత్తగా మంజూరైన కిడ్నీ పెన్షన్ రూ.10 వేలు అందజేస్తున్న నాయకులు, వలంటీర్

సత్తెనపల్లి: అవ్వాతాతలకు, ఒంటరి మహిళలకు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసే పింఛన్లు గత పాలకులు చిన్నచూపు చూసేవారు. నాడు పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు చాంతాడంత క్యూలల్లో గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాల వద్ద పడిగాపులు పడే దుస్థితి. నేడు వలంటీర్లు ఒకటో తేదీనే లబ్ధిదారుల గడప వద్దే పెన్షన్లు అందించే పరిస్థితి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛన్ నగదు రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుకుంటూ లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు.


నాడు జన్మభూమి కమిటీలకు లంచాలు..

టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే కొత్త పింఛన్లు మంజూరైన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు లంచాలు, వివక్షకు తావు లేకుండా అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తున్నారు. తమ వద్దకు వచ్చే గ్రామ, వార్డు వలంటీర్ సహాయంతో అర్హత ఉంటే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది. అనంతరం సచివాలయంలోనే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

పెన్షన్ల పంపిణీ ప్రారంభం..

సత్తెనపల్లి డివిజన్‌లోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుకను శుక్రవారం తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వలంటీర్లు ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు రూ.3 వేలు చేతిలో పెట్టి వారితో వేలిముద్రలు వేయించుకున్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ



క్రోసూరు జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సువర్ణ

క్రోసూరు: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ ఎం.సువర్ణ తనిఖీ చేశారు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం, విప్పర్ల, క్రోసూరు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. నాలుగు గ్రామాల్లో 20 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ నంబర్ 122 నుంచి 131, 139 నుంచి 148 వరకు ఉన్న పీఎస్‌లు పరిశీలించారు. అక్కడి పాఠశాలలు పీఎస్‌గా ఎన్నికలు నిర్వహణకు అనువుగా ఉన్నట్లు తెలిపారు. కిటీకీలు, వెంటిలేషన్, తలుపులు, బల్లలు అన్ని బాగా ఉన్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

పవిత్ర హృదయంతో ప్రార్థించాలి



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: తపస్సు కాల దీక్ష తీసుకున్న మాలధారులు పవిత్ర హృదయంతో యహోవాదేవుని కుమారుడైన ఏసుక్రీస్తును ప్రార్థించాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించిన గ్రామంలోని వివిధ ప్రాంతాలలో నున్న పలు మందిరాల వద్ద ప్రత్యేక ప్రార్థనలలో భాగంగా 14 స్థలాల కార్యక్రమంలో ఫాదర్ మర్రెడ్డి భక్తులకు తపస్సు కాలం విశిష్టతను వివరించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ ఘడియలలో శిలువ వేయబడి పడిన కష్టాలను క్రైస్తవులు స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దీక్షలను తీసుకుని నిండు హృదయంతో ఉపవాసం, ప్రార్థన, దాన ధర్మాలు చేయాలన్నారు. మాలధారులు మార్చి 31వ తేదీ వరకు 40 రోజుల పాటు ఈ తపస్సుకాల ప్రార్థనలలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాలలో సాయంత్రం నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తుచేస్తు 14 స్థలాల పాట్లను స్మరించుకుంటూ ప్రార్థనలలో పాల్గొనాలన్నారు. సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, మఠ కన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

క్రోసూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో క్రోసూరు, అచ్చంపేట పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు, వైద్య సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణకుమారి శుక్రవారం తెలిపారు. అచ్చంపేటలోని సాయిబాబ కల్యాణమండపంలో జరుగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి పాల్గొంటారని తెలిపారు. బాలలపై జరుగుతున్న అత్యాచారాలు, బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, మండలంలోని అధికారులు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది తప్పక పాల్గొనాలని కోరారు.

పర్యావరణహితంగా జీవించాలి



పర్యావరణ పరిరక్షణ గురించి వివరిస్తున్న జాజి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో 'ప్రకృతి ఆధ్యాత్మికం' పేరుతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని సాక్షి ఎక్స్‌లెన్స్ అవార్డు గ్రహీత పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. పర్యావరణం ప్రమాదంలో పడిందని రుతువులు గతి తప్పుతున్నాయని ప్రతి ఒక్కరు ప్రాథమిక విధులను గుర్తెరిగి నడచుకోవాలని చెట్లను పెంచాలని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు కోరారు. వర్షాకాలంలో పడే వర్షాలతోనే భూగర్భ జలాల పరిరక్షణ జరుగుతుందని, వర్షాలు పడకపోవడానికి అడువుల విస్తీర్ణం తగ్గడంతో పాటు వాతావరణ కాలుష్యమే ప్రధాన కారణమని ప్రతి ఒక్కరు పర్యావరణహితాన్ని కోరే జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు చెట్లను పెంచాలని విన్నవించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పట్టాలపై పడి ఉన్న మృతదేహం

సత్తెనపల్లి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాలు వయస్సు కలిగి తెల్లచొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న 12703 ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఉదయం 9:07 గంటలకు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగింది. వందేభారత్ రైలు వస్తుండటంతో క్రాసింగ్‌లో భాగంగా ఫలక్‌నుమా ఆగింది. ఈ క్రమంలో ఆగి ఉన్న రైలు కిందకు వెళ్లగా ఒక్కసారిగా రైలు కదలడంతో నడుముపైగా రైలు వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ప్రమాదవ శాత్తు జరిగిందా అనేది విచారణలో తేలాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతుడి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.